ప్రజాశక్తి
గురువారం 19 జనవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# గంటా కంఠం మోగింది !



◆ గడచిన రెండేళ్లూ కోవిడ్ ఇబ్బందులే వెంటాడాయంటూ వ్యాఖ్య
◆ టిడిపిని వీడడం లేదని స్పష్టీకరణ
◆ ఎట్టకేలకు మౌనం వీడిన టిడిపి నేత, మాజీ మంత్రి
◆ వేదికగా మారిన ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుక

మీడియాతో మాట్లాడుతున్న గంటా

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఎట్టకేలకు గంటా కంఠం తెరుచుకుంది. ఎన్నికల్లో గెలవడం.. ఆ తర్వాత ఆ నియోజవర్గ ప్రజలకు ముఖం చాటేయడం.. మరలా ఎన్నికలు వస్తున్నాయంటే తళుక్కుమనడం సదరు నేతకు షరామామూలే. టిడిపి మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పార్టీలు తరచూ మారే నేతగా.. ఏ రాజకీయ నాయకుడూ పొందనంత ప్రచారం పొందుతారనడం అతిశయోక్తి కాదు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఓటమి చెందినప్పటికీ.. విశాఖలో ఆ పార్టీ కాస్తో కూస్తో నిలదొక్కుకోవడంలో గంటా కూడా ముఖ్య కారకునిగా నిలిచారు. అప్పట్లో వైసిపి ప్రభంజనంలోకి రాష్ట్రం వెళ్లిపోతే... విశాఖ నగరంలో నాలుగుచోట్ల టిడిపి గెలిచింది. ఉత్తర నియోజక వర్గంలో వైసిపి నాయకుడు కెకె.రాజు గట్టి పోటీ ఇచ్చినా తుదకు రెండు వేల ఓట్ల మెజారిటీతో గంటా గెలుపొందారు. ఆ తరువాత సైలెంట్ అయిపోయారు.

**టిడిపిని వీడుతున్నట్లూ ప్రచారం**

గడచిన కొద్ది రోజులుగా గంటా శ్రీనివాసరావు టిడిపిని వీడిపోనున్నారంటూ ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. కానీ తాజాగా వాటన్నిటినీ పటాపంచలు చేస్తూ ఆయన మౌనం వీడి టిడిపిలోనే కొనసాగుతానని చెప్పారు. విశాఖలో బుధవారం జరిగిన ఎన్‌టి రామారావు వర్ధంతి వేడుకల్లో మిగతా టిడిపి నేతలతో పాటు గంటా కూడా పాల్గొని టిడిపి గళం వినిపించడం విశేషం. ఇంతవరకూ తెలుగుదేశం పార్టీ పరంగా విశాఖ జిల్లాలో జరిగిన ఏ ఒక్క కార్యక్రమంలోనూ, సమీక్షా సమావేశాల్లోనూ పాల్గొనకుండా గంటా దూరం పాటిస్తూ వచ్చారు. ఆయన ఉన్నట్టా ? లేనట్టా ? అంటే టిడిపి నేతలు సైతం నోరుమెదపలేని పరిస్థితి కొనసాగింది. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విశాఖ పలుమార్లు వచ్చినా గంటా మాత్రం పత్తా లేకుండా పోయేవారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రంలోని బిజెపి నిర్ణయం చేసిన తర్వాత తాను తన ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేసి ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో పాల్గొంటానంటూ మీడియా సమావేశం నిర్వహించి మరీ గంటా చెప్పారు. తర్వాత ఆయన ఎక్కడా కనపడలేదు. వైసిపిలో చేరుతున్నారన్న ప్రచారం కూడా గతంలో సాగింది. తాజాగా జనసేన పార్టీ సభలు, సమావేశాలతో ఊపునిస్తుందంటూ ఆ సామాజిక తరగతుల్లో వచ్చిన చర్చతో గంటా కూడా జనసేన తీర్థం పుచ్చుకోనున్నారన్న ప్రచారం కూడా సాగింది. రాజకీయ వర్గాల్లో తన గురించి ఏం చర్చ మిగతా 2లో..



మార్కెట్‌లో నిమ్మకాయలు అమ్ముతున్న యువకుడు

# కొండెక్కిన నిమ్మకాయ

**ఒక్కసారిగా పెరిగిన ధరలు**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** సాధారణంగా నిమ్మకాయల ధర వేసవిలో ఎక్కువగా, చలికాలంలో తక్కువగా ఉంటుంది. అయితే ఈ ఏడాది చలికాలంలో కూడా వీటి ధర చుక్కలనంటుతోంది. బస్తా నిమ్మకాయల ధర రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు ఒక్కసారిగా పెరిగింది. దీంతో ఇటు వ్యాపారులు.. అటు కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌కు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, తూర్పు గోదావరి జిల్లా యాదవోలు నుంచి లారీల్లో నిమ్మకాయలు దిగుమతి అవుతాయి. జ్ఞానాపురం మార్కెట్ నుంచి నిమ్మకాయలు నగరంలోని రైతు బజార్లకు, ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతాయి. నిమ్మకాయలు దిగుమతి ధర రెట్టింపు కావడంతో రిటైల్ వ్యాపారులూ ధర పెంచారు. ఇప్పటి వరకూ రూ.10కి 10 కాయలు అమ్మేవారు. రూ.10కి ఇప్పుడు నాలుగే ఇస్తున్నారు. అవీ సైజు బాగా తగ్గిపోయాయి. పంట తగ్గడం వల్ల సరుకు ధర పెంచేశారని వ్యాపారులు అంటున్నారు. చలికాలంలోనూ ఇంత ధర ఏమిటని కొనుగోలుదారులు మండి పడుతున్నారని జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారి దాడి రామకృష్ణ చెప్పారు. సంక్రాంతి వంటి ప్రధాన పండగ రోజులలో నిత్యావసరాల ధరలతో పాటు నిమ్మకాయలు కూడా ప్రియం కావడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 'ప్రజాగర్జన'తో కేంద్రం కళ్లు తెరిపిస్తాం

▶ వార్త మెయిన్‌లో..

## రహదారి భద్రత.. అందరి బాధ్యత

▶ వార్త 2లో..

## నగర సుందరీకరణకు ప్రాధాన్యత

▶ వార్త 2లో..



సినీ నటి జయసుధను సత్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో యార్లగడ్డ, రాఘవేంద్రరావు, ఎంపీ ఎంవివి తదితరులు

## ఘనంగా లోక్ నాయక్ పురస్కార ప్రదానోత్సవం

◆ వేమూరి బలరామ్‌కు సాహిత్య అవార్డు ◆ పలువురికి సత్కారం

వార్త మెయిన్ పేజీలో..

# ఇపిడిసిఎల్‌పై బకాయిల గుదిబండ

**6 నెలలుగా రాని మొత్తం రూ.2,236 కోట్లు**
**అధికభాగం ప్రభుత్వం ఇవ్వాల్సిందే..**
**ఆర్థికంగా చితికిపోతున్న సంస్థ**



ఇపిడిసిఎల్ భవనం (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు బకాయిలు పెద్ద సమస్యగా మారాయి. ప్రభుత్వ సబ్సిడీలు చెల్లించకపోవడం, అధిక విద్యుత్ వినియోగిస్తున్న ప్రభుత్వ, ప్రయివేటు వినియోగదారుల నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో సంస్థ తేరుకోలేకపోతోంది. విద్యుత్ సరఫరా చేసిన మేరకు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోతుంది. ఆర్నెళ్లుగా రూ.50 వేలు విద్యుత్ బిల్లు చెల్లించని 16,694 ఎల్‌టి, హెచ్‌టి సర్వీసుల ద్వారా సంస్థకు రూ.2,236.82 కోట్లు రావాల్సివుంది. అందులో స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.1167.39 కోట్లు వుంది. ఇపిడిసిఎల్ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 16,036 ఎల్‌టి సర్వీసుల నుంచి రూ.749.11 కోట్లు, 658 హెచ్‌టి సర్వీసుల నుంచి రూ.1487.71 కోట్లు బకాయి వున్నాయి. గతేడాది సెప్టెంబరు 30 నాటికి ఆర్నెళ్లుగా 50 వేల రూపాయల బిల్లు చెల్లించని కేటగిరీల వారీ సర్వీసుల వివరాలను ఇపిడిసిఎల్ తయారుచేసి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సమర్పించింది. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ సంబంధిత, బిల్లులు నిలిపివేసిన, కోర్టు వివాదాలు, స్థానిక సంస్థలు, ఎస్‌సి, ఎస్‌టి, అండర్ డిస్‌కనెక్ట్ (యుడిసి) ఎల్‌టి సర్వీసులు 1211 నుంచి రూ.27.02 కోట్లు రావాల్సివుంది. విజయనగరం జిల్లాలో 932 సర్వీసుల నుంచి రూ.25.47 కోట్లు, విశాఖపట్నం జిల్లాలో 4,771 సర్వీసుల నుంచి రూ.131.38 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 3269 సర్వీసుల నుంచి రూ.161.52 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 5853 సర్వీసుల నుంచి రూ.403.71 కోట్లు సంస్థలకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

### గంటా కంఠం మోగింది !

జరుగుతోంది ? ప్రజలు ఏమనుకుంటున్నారు ? అన్న విషయాలను నిశితంగా గమనించే మనస్తత్వంగల గంటా శ్రీనివాసరావును తక్కువగా అంచనా వేయొద్దని అతని అనుయాయుల చెబుతున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన వాడు కానప్పటికీ ఈ ప్రాంతంలో వ్యాపారాలు, రాజకీయాలను 1980వ దశకం నుంచీ నిర్వహిస్తూ ఈ ప్రాంతంలో ఒక పెద్ద నాయకుడిగానే గంటాకు గుర్తింపు ఉందన్న విషయాన్ని మరువొద్దని గుర్తు చేస్తున్నారు.

**భవితవ్యం ఏమిటి ?**

2024 ఎన్నికల్లో గంటా భవితవ్యం ఏమిటి ? అన్న ప్రశ్న ఆ పార్టీ శ్రేణులకే కాదు, యావత్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. కాపుల నాయకునిగానూ గంటాకు గుర్తింపు ఉండడంతో జనసేన పార్టీలో చేరే అవకాశాలూ ఉన్నాయన్న ప్రచారం సాగింది. గతంలో విశాఖలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును సాగర్‌నగర్‌లోని అతని స్వగృహంలో గంటా కలిశాక బిజెపిలో చేరతారన్న ప్రచారమూ సాగింది. వామపక్షాలు మినహా అన్ని రాజకీయ పార్టీలతోనూ గంటాకు ఆ చొరవ ఉందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అయితే ఏదో ఒక రాజకీయ పార్టీలో ఉన్నానన్న సంకేతాలు (ఎన్నికలు వస్తున్నాయి గనక) ఇవ్వాల్సిన అవసరం గంటాకు ఏర్పడిందనేది తెలుస్తోంది.. దీంతో ఎట్టకేలకు బుధవారం తను మౌనం వీడారనే చెప్పొచ్చు. తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి... తాను పార్టీని మారబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని గంటా తాజాగా స్పందించారు. టిడిపిని వీడలేదని, అందులోనే కొనసాగుతానని తేల్చిచెప్పారు. రెండు సంవత్సరాలు కోవిడ్‌లోనే గడచిపోయాయని, ఆ తర్వాత అనుకోని విధంగా తనకు కొన్ని ఇబ్బందులు వచ్చాయని తాజాగా వెల్లడించారు. అవన్నీ ఇప్పుడు పరిష్కారమయ్యాయని, ఇకపై తాను పార్టీలో పూర్వంలాగే క్రియాశీలకంగా వ్యవహరిస్తానని చెప్పుకొచ్చారు.

### ఇపిడిసిఎల్‌పై బకాయిల గుదిబండ

రావాల్సివుంది.

హెచ్‌టి సర్వీసులకు ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో బిల్లులు చెల్లించుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడంతో ప్రతి నెలా బిల్లు చెల్లించే స్తోమతవున్న హెచ్‌టి వినియోగదారులు నెలల తరబడి చెల్లించడంలేదు. ఈ తరహాలో 11 సర్వీసుల నుంచి రూ.69.69 కోట్లు రావాల్సివుంది. హెచ్‌టి సర్వీసులకు ప్రభుత్వమే మినహాయింపు ఇవ్వడంతో సంస్థ ఒత్తిడి చేసి కట్టించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.447.76 కోట్లు రావాల్సివుంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు సరిపడా బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించి నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్ బిల్లులు చెల్లించుకోలేని దుస్థితిలో ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. అధికారులను బతిమలాడి బిల్లులు వసూలు చేసుకోవడం తప్ప ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసే సాహసం సంస్థ చేయలేకపోతోంది. యుడిసి సర్వీసులు రెండింటి నుంచి రూ.29.30 లక్షలు రావాల్సివుంది. కోర్టు కేసుల్లో వున్న సర్వీసులు మినహా మిగిలిన బకాయి రాబట్టేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించడంలేదు.

**ఇపిడిసిఎల్‌కు హెచ్‌టి సర్వీసుల నుంచి రావాల్సిన బకాయి వివరాలు**

| వివరాలు | సర్వీసులు | బకాయి (రూ.కోట్లలో..) |
|---|---|---|
| విద్యుత్ నిలిపినవి | 113 | 46.53 |
| కోర్టు కేసులు | 324 | 923.43 |
| ప్రభుత్వ కార్యాలయాలు | 208 | 447.76 |
| వాయిదాల పద్ధతి | 11 | 69.69 |

### ప్రభుత్వ భూములను పరిరక్షించరూ..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ రూరల్ మండలం పరిధిలోని విశాలాక్షి నగర్ వద్ద జాతీయ రహదారిని ఆనుకొని నాటు కోళ్ళ అమ్మే ప్రాంతంలో ఉన్న 300 చదరపు గజాల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. బుధవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని కబ్జాదారులు అక్రమంగా చదును చేసి అన్యాక్రాంతం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారన్నారు. ఈ విషయం పలు వార్తా పత్రికల్లో వచ్చిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. విలువైన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు కబ్జాల వెనుక ఉన్న అక్రమార్కులను గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ఐసిఎస్ఐ చైర్మన్‌గా గిరిధరన్ ఎన్నిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) విశాఖపట్నం చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం జరిగాయి. నూతన చైర్మన్‌గా జిఎస్.గిరిధరన్, వైస్ చైర్మన్‌గా మనోజ్ పరాఖ్, కార్యదర్శిగా శివకుమార్ శరగడం, కోశాధికారిగా చలపతిరావు మారతి, సభ్యులుగా ఎన్.సుబ్బరామన్, కూచిపూడి సురేంద్ర, నాగ శివాని ఎన్నికయ్యారు. ఈ పాలకవర్గం ఏడాది కాలం ఉంటుంది.

# రహదారి భద్రత.. అందరి బాధ్యత

**విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున**

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రహదారి భద్రత మనందరి బాధ్యత అని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలు - స్వచ్ఛత పక్షోత్సవాలను బుధవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలను ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం తలపెట్టామని చెప్పారు. డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండిషన్‌లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రతి నెలా జరిగే రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సూచించిన భద్రతా అంశాల పరిష్కారానికి పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

చాలా చోట్ల బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సేఫ్టీ స్పాట్స్‌గా మార్చామన్నారు. నగరంలో గుంతల రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలుగుతున్నామన్నారు. అధిక రోడ్డు ప్రమాదాలు ప్రయాణంలో మొబైల్ వాడకం, మద్యపానం, అతి వేగం వల్ల జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప రవాణా అధికారి రాజారత్నం, డిసిపి సుమిత్ గరుడ్, ఉప రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్ర యువతను కదిలిస్తుంది

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 27 నుంచి రాష్ట్రంలో చేపట్టనున్న పాదయాత్ర సెన్సేషనల్ అవుతుందని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి టిడిపి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కూడా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 400 రోజులపాటు నాలుగు వేల కిలోమీటర్ల మేర జరగనున్న లోకేష్ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయని చెప్పారు. యువత దేశానికి కీలకమన్నారు. అటువంటి వారు మన రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇటువంటి సమయంలో చేపడుతున్న లోకేష్ పాదయాత్ర ఎంతోమందిని కదిలిస్తుందని అన్నారు.

చంద్రబాబు, లోకేష్ తమ పార్టీ కుటుంబ పెద్దలని వ్యాఖ్యానించారు. వారిని ఎల్లవేళలా కలిసే అవకాశం ఉందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ గొప్పతనాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, పశ్చిమ ఎమ్మెల్యే పిజిజిఆర్.నాయుడు (గణబాబు), ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పల్లా శ్రీనివాసరావు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామ్, చిక్కాల విజయ్ బాబు, రాజమండ్రి నారాయణ, పైల ముత్యాలనాయుడు, గోగినేని సాంబశివరావు, గొలగాని వీరారావు, కోరాడ రాజబాబు, విల్లూరి డాక్టర్ చక్రవర్తి పాల్గొన్నారు.

### తెలుగు శక్తి యుద్ధభేరి సీడీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగు శక్తి ఆధ్వర్యాన త్వరలో నిర్వహించే యుద్ధభేరి ఆడియో సీడీని మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. వైసిపి ప్రభుత్వ పాలనా తీరును ఎండగడుతూ ఈ సీడీ రూపుదిద్దుకుందని తెలిపారు. తెలుగు శక్తి అధ్యక్షుడు, విశాఖ వాసి బివి.రామ్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకే యుద్ధభేరి అని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అరాచకమైన పాలన కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కీర్తిశేషులు ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తెలుగు శక్తి ప్రజలను చైతన్య పరుస్తోందన్నారు.

### రైతులకు మాస్టర్ కార్డు డిజిటల్ పేమెంట్ సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 10 లక్షల మంది రైతులకు మాస్టర్ కార్డు డిజిటల్ పేమెంట్ సేవలు అందించి సరికొత్త మైలురాయి చేరిందని మాస్టర్ కార్డు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తారనాథ్ ప్రకటించారు. నగరంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సన్నకారు రైతులకు మరింత వేగంగా చెల్లింపులు చేయడానికి మాస్టర్ కార్డు తోడ్పడుతోందని తెలిపారు. కార్యక్రమంలో లీఫ్ వ్యవస్థాపకులు పలగ్ విజయ రాఘవన్, బసిక్స్ సిఇఒ డి.సత్రియ పాల్గొన్నారు.

## లీడ్ విజేతలుగా 'ప్రజ్ఞ' విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో అతిపెద్ద స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్.. తమ లీడ్ ఛాంపియన్‌షిప్ - 2022 విజేతలను వెల్లడించింది. విజేతలకు లీడ్ కో - ఫౌండర్, సిఇఒ సుమీత్ మెహతా అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులతో పోటీపడి విజయం సాధించడం సాధారణ అంశమేమీ కాదన్నారు. విశాఖకు చెందిన ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.పురుషోత్తమ చారి మాట్లాడుతూ తమ విద్యార్థులు నవ్య, హిమవర్ష లీడ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచారని అన్నారు. ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్నామని, ఈ తరహా జాతీయ స్థాయి పోటీల కారణంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అలాగే వైజాగ్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ధ్రువిక జూనియర్ విభాగంలో ఫైనలిస్ట్‌గా నిలిచారు.

### నగర సుందరీకరణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర సుందరీకరణ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు జివిఎంసి ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు పక్కగా నిర్వహించాలని, పారిశుధ్యానికి కావలసిన పరికరాలు అవసరం ఉండి కొనవలసినట్లయితే వెంటనే ఆమోదం కోసం నివేదికలు పంపించాలని, ప్రధాన కాలువలలోని అడ్డంకులను తొలగించాలని, ఖాళీ స్థలాల్లోనూ, రోడ్డు మార్జిన్లలోనూ, చెత్త పడే ప్రదేశాలలోనూ అవసరాన్ని బట్టి డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని అన్నారు.

### ఫిబ్రవరి 28న కెఎంసిబి ఎన్నికలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఖాళీ అయ్యే మూడు డైరెక్టర్ల పదవులకు ఫిబ్రవరి 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది కె.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కయ్యపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ ఎన్నికలు ఆ రోజున ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అదేరోజు ఓట్లను లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోగా నామినేషన్లను దాఖలు చేయవచ్చన్నారు.

నామినేషన్‌కు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. దాఖలైన నామినేషన్లను ఫిబ్రవరి 17న పరిశీలిస్తామని, చెల్లుబాటైన నామినేషన్ల వివరాలను మరుసటి రోజున ప్రకటిస్తామని తెలిపారు. 19న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చునని చెప్పారు. పోటీ అనివార్యమైతే 28న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

# ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

- వాడవాడలా 27వ వర్ధంతి
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు



భీమిలిలో రక్తదానం చేస్తున్న రాజబాబు, ఇతర టిడిపి నేతలు

**టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్రులకు అన్న ఎన్‌టిఆర్ 27వ వర్ధంతిని తెలుగు తమ్ముళ్లతోపాటు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన ఎన్‌టిఆర్ సేవలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరాలతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.**

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)



పెందుర్తిలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి బండారు

**భీమునిపట్నం:** స్థానిక టిడిపి కార్యాలయం వద్ద భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ సౌజన్యంతో రక్తదానశిబిరం నిర్వహించారు. ముందుగా చినబజారు జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మూడవ వార్డు కార్పొరేటర్‌గంటా అప్పలకొండ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షులు బోయి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షులు డిఎవన్ రాజు, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు, వార్డుల అధ్యక్షులు టి సూరిబాబు, బడిగింటి నీలకంఠం, పాసి నరసింగరావు, గరే సదానంద పాల్గొన్నారు.

**తగరపువలసలో..** స్థానిక రాజవీధి, హైవే కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహాలకు పార్టీ నాయకులు టి సూరిబాబు, బడుగింటి నీలకంఠం, గిడుతూరి శ్రీను, చిలకా నరసింగరావు, ఎంవి గురుమూర్తి, జె గణేష్‌రెడ్డి నివాళులర్పించారు.

**భీమిలి గ్రామీణ మండలంలో...** టి నగరపాలెం, లక్ష్మీపురం, కృష్ణంరాజుపేట, అమనాం గ్రామాల్లో ఎన్‌టిఆర్‌కు తెలుగుతమ్ముళ్లు ఘననివాళులర్పించారు.

**పెందుర్తి :** పెందుర్తి కూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేపగుంటలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి 94వ వార్డు టిడిపి కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన పేదల పెన్నిధి, యుగ పురుషుడు ఎన్‌టిఆర్ ఆశయసాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు వార్డు అధ్యక్షుడు గంట్ల దివాకర్, మామిడి కిరణ్, సూరిబాబు పాల్గొన్నారు

**పిఎం పాలెం:** ఆరో వార్డు పిఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విగ్రహ దాత, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనంద్‌బాబు, కెవిఆర్ క్యాటరింగ్ అధినేత, జిల్లా తెలుగు యువత కార్యదర్శి గరే గురునాథ్, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ నివాళులర్పించారు.

ఐదవ వార్డు పరదేశిపాలెంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, విశాఖ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాండ్రాశి అప్పలరాజు, బోయి శ్రీను ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు భీమిలి తెలుగు మహిళ అధ్యక్షురాలు బోయి రమాదేవి, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీనివాస్, వార్డు ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, తెలుగు యువత అధ్యక్షులు కొండపు రాజు పాల్గొన్నారు.

**పద్మనాభం :** పాండ్రింగిలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు, పద్మనాభంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడుకోరాడ రమణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ సేవలను కొనియాడారు. తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి, మాజీ జెడ్‌పిటిసి కశిరెడ్డి దామోదరరావు, ఎంపిటిసి కంటుబోతు లక్ష్మి.శ్రీను, అప్పలనాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

**ములగాడ :** పారిశ్రామిక ప్రాంత టిడిపి నేతల



ములగాడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఆధ్వర్యంలో మల్కాపురం, రామకృష్ణాపురం, హెచ్‌పిసిఎల్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహాలకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. టిడిపి నేతలు మజ్జి. సోమేశ్, నక్క. లక్ష్మణరావు నీలాపు జోజి, కాకి పోలిరెడ్డి, చింతలపూడి సత్తిబాబు, మజ్జి మాలి నాయుడు డోప్పు సన్యాసిరావు, పాల్గొన్నారు.

**మాధవధార:** 50వ వార్డు టిడిపి అధ్యక్షులు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో మురళీనగర్ పార్టీ కార్యాలయం నుంచి బిర్లా జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వార్డు టిడిపి అధ్యక్షులు పోలమరశెట్టి శ్రీను, మూల అప్పారావు, సనపల రామచంద్రరావు, కనమటి రమణ, పేడాడ మధు, ఎన్‌టిఎస్ కుమార్, తెలుగు యువత అధ్యక్షులు బొందల మదన్‌మోహన్, మహిళ అధ్యక్షులు పైడి పుణ్యవతి, ప్రమీల రాణి, దవల కుమారి, అజయ్, నాగన్న, సనపల విజయ్‌కుమార్, కంచరాణ వరదరాజు, ఒబాళ్ల సత్యనారాయణ, ఓంబాబు, సనపల గోవింద రాజు, సనపల సత్యనారాయణ, మూల రాము, సత్యవతి, పరమేష్, నంబాళ్ల కనకరాజు, నిరంజన్, ఉపేంద్ర, సాయి కుమార్, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

**ఆరిలోవ** : 9వ వార్డు జోడుగుళ్ళపాలెంలో వార్డు పార్టీ ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు అధ్యక్షుడు అక్కరమాని రాంబాబు, బాదరు బాల రాజు, నల్ల ఈశ్వరరావు, శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

**10వ వార్డులో...** కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ ఆధ్వర్యంలో రవీంద్రనగర్ , బిఎన్ఆర్ నగర్‌లలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, కె. సత్యనారాయణ, లక్ష్మీ, తులసి పార్వతి, వెంకటరావు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**11, 12 వార్డుల్లో...** ఆరిలోవ దుర్గాలమ్మ గుడి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికిపార్టీ నేతలు గాడి సత్యం, మూది అప్పారావు, దువ్వి తాతారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సింహాచలం:** 98వ వార్డు సింహాచలం మార్కెట్ ఏరియాలో వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహించారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి కార్యదర్శి పాసర్ల ప్రసాద్, కార్పొరేటర్ నరసింహులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సేవలను కొనియాడారు. తెలుగు యువత అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, మేకల కాసుగోపాల్, గుసిడి అవినాష్, గుసిడి శంకరరావు, పట్నాల ధర్మారావు రౌతు రాంబాబు, బిసి రమణ పాల్గొన్నారు.

**మధురవాడ:** ఏడో వార్డు మార్కెట్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ నివాళులర్పించారు. వార్డు అధ్యక్షులు పిళ్లా నరసింగరావు సీనియర్ నేత పిళ్లా వెంకటరావు, నాగోతి సూర్యప్రకాష్, కానూరి అచ్యుతరావు, పోతిన సోముపాత్రుడు, నాగేశ్వరరావు, కిషోర్, బండయ్య పాల్గొన్నారు.



పిఎం.పాలెంలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు



మాధవధారలో పండ్లు పంపిణీ చేస్తున్న వరప్రసాద్



మధురవాడలో ఎన్‌టిఆర్‌కు పూలమాల వేస్తున్న మంగమ్మ

## మానవ హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- పెందుర్తి : మానవ హక్కుల పరిరక్షణకు, ప్రజల సమస్యలపై తన వంతు బాధ్యతగా పోరాడతానని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్(ఐహెచ్ఆర్‌సి) అల్లూరి జిల్లా అధ్యక్షుడు బి.డేవిడ్ అన్నారు. బుధవారం ఐహెచ్ఆర్‌సి జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఈ మేరకు డేవిడ్‌ను అల్లూరి జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మానవహక్కుల పరిరక్షణకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, కార్యాచరణ వివరించారు. దీనికి డేవిడ్ స్పందిస్తూ, తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

## పలు సచివాలయాల్లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి భీమిలి జోన్ పరిధిలోని ఒకటో వార్డు సంతపేట, 3వ వార్డు తోటవీధి సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నట్లు జోనల్ కార్యాలయం అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఆధార్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## ఫండెడ్ యూనిట్‌గా గుర్తింపుపై హర్షం

ప్రజాశక్తి- వేపగుంట :నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను ఫండెడ్ యూనిట్‌గా విజయనగరం జెఎన్‌టియు గుర్తించిందని కాలేజీ ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్ తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం చేస్తున్న సేవలకు జెఎన్‌టియు గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరునాయుడు, తదితరులను కాలేజీ యాజమాన్యం అభినందించింది. కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చేందుకు మున్ముందు సమిష్టిగా మరింత కషి చేయాలని సూచించారు.

## నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే విఫలం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి జోన్ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.20లక్షలు చొప్పున నిధులు రాబట్టడంతో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పూర్తిగా విఫలమయ్యారని టిడిపి నేతలు ఆరోపించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో టిడిపి నగర కార్యదర్శి పిట్టా సురేష్, ఒకటో వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సూరిబాబు, వానపల్లి సత్య, సీనియర్ నాయకులు ఎస్ నరసింగరావు మాట్లాడుతూ, జోన్ పరిధిలో 21 వార్డు సచివాలయాలుండగా, ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.20లక్షలు కేటాయిస్తే రూ.4.20 కోట్లు మంజూరు కావాల్సి ఉందన్నారు. అయితే 2.52కోట్లు నిధులు విడుదలైనట్లు స్వయంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రకటించారంటే మిగిలిన నిధులు ఏమైపోయాయని ప్రశ్నించారు. దీన్ని బట్టి అదనపు నిధులు మాట అటుంచితే, ప్రకటించిన నిధులైనా తెచ్చుకోవడంలో ఎమ్మెల్యే వైఫల్యం చెందినట్టేనని స్పష్టమౌతోందన్నారు.

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార: భీమిలి, మధురవాడ జోన్ల పరిధిలోని అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమీక్షించారు. బుధవారం సీతమ్మధారలోని తన నివాసంలో నిర్వహించిన సమీక్షలో గడపగడపకు నిధులతో సిసిరోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం కల్పనకు సంబంధించిన పనులను రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

నాలుగోవార్డు మధురవాడకు ఏలేరు కాలువ నీరు అందించాలని, గోస్తనీ నది పైపులైన్ పనులను మార్చిలోగా పూర్తిచేయాలని, మధురవాడ, తుమ్మిగడ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని స్టోరేజీ వాటర్ ట్యాంక్ అభివృద్ధిపై సంబంధిత అటవీశాఖాధికారులతో మాట్లాడి చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తాగునీటి సరఫరా విభాగం ఎస్ఇ, జోనల్ కమిషనర్లు, ఎస్ఐలు, ఇఇలు, ఇతర అధికారులతోపాటు వార్డు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## వైభవంగా ముక్కనుమ పరస

ప్రజాశక్తి- గాజువాక : 87వ వార్డు కణితి గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముక్కనుమ పరసలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరసను తిలకించారు. తప్పెటగుళ్లు, కోలాటం, సేవా గరిడీలు, చెక్కభజనలతోపాటు పరసలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

కార్యక్రమంలో వార్డు వైసిపి నేతలు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద, దుగ్గపు దానప్పలు, సిహెచ్‌వి రమణ, ఆడారి శ్రీను, ఎన్నేటి రమణ, కాండ్రేగుల అప్పలనాయుడు, గౌరీ సేవా సంఘం సభ్యులు మల్ల రాము, సూరిశెట్టి రాము, ఎల్లపు సూరిబాబు, కాండ్రేగుల కనుక, కరణం లక్ష్మి పాల్గొన్నారు.

## మద్దిలో తులసీరావు సంతాప సభ

**ప్రజాశక్తి-పద్మనాభం:** మండలంలోని మద్ది బిసిసి ప్రాంగణంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభను నిర్వహించారు. తులసీరావు చిత్రపటానికి ఎంపిపి కె.రాంబాబు జ్యోతిప్రజ్వళన చేసి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, విజయ విశాఖ డెయిరీ చైర్మన్‌గా 30ఏళ్లకు పైగా సేవలు అందించిన తులసీరావు, డెయిరీ అభివృద్ధికి, పాడిరైతులు సంక్షేమానికి చేసిన సేవలు అజరామరమన్నారు. కార్యక్రమంలో స్థానిక నేత సత్యనారాయణ, సిబ్బంది ప్రసాద్, అప్పలరాజు, దేముడుతోపాటు పాలసొసైటీల అధ్యక్షులు, పాలసేకరణ సిబ్బంది పాల్గొన్నారు. అనంరతం ఎలమంచిలిలో ఆడారి పెద్దకర్మలో పాల్గొనేందుకు ప్రత్యేక బస్సులో వారంతా తరలివెళ్లారు.

## అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు

**ప్రజాశక్తి- సింహాచలం:** ధనుర్మాసం దారోత్సవాల అనంతరం బుధవారం నుంచి అప్పన ఆలయంలో ఆర్జిత సేవలు ప్రారంభమయ్యాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఏకాదశిని పురస్కరించుకుని స్వామికి నిత్య కల్యాణం నిర్వహించారు. వైభవంగా స్వామి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు.అలాగే ఏకాదశిని పురస్కరించుకుని లోకకల్యాణార్థం అప్పన ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామార్చనను స్థానాచార్యులు గోపాల్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

# 20, 21 తేదీల్లో ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలాజీ, తదితరులు

ప్రజాశక్తి-గాజువాక: ఈనెల 20 21 తేదీల్లో గాజువాక ఆటోనగర్‌లో వాసవి బిల్డింగ్ పక్కన ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో -2023 నిర్వహించనున్నట్లు వాసవి అధ్యక్షుడు ఎకె.బాలాజీ తెలిపారు.. బుధవారం వాసవి కార్యాలయంలో ఈ మేరకు ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, ఈ ప్రదర్శనకు మొదటిరోజు, 20న స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. నగరంలోని వివిధ పరిశ్రమల యజమానులు తమ ఉత్పత్తులను రెండు రోజుల ప్రదర్శనలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో వాసవి సెక్రటరీ వినోద్, ఉపాధ్యక్షులు కృష్ణ ప్రసాద్, వై సాంబశివరావు పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక



కలుసుకున్న ఒకే బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సెయింట్ ఆన్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే చోట కలిసి చదువుకుని, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 1972-84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక బుధవారం జరిగింది. పూర్వ మిత్రులంతా కలిసిన ఆనందంలో ఆప్యాయంగా పలకరించుకుని, పరస్పర యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో సరదాగా గడిపారు. ఆస్ట్రేలియా, ఢిల్లీ వంటి సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు కూడా ఈ ఆత్మీయ కలయికకు రావడం విశేషం.

# మంచి చిత్రాలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : మంచి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించి, ప్రోత్సహించాలని వైజాగ్ ఫిలిం సొసైటీ, నగర కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. బుధవారం వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో 'సినిమా బండి' చిత్ర ప్రదర్శన, దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం లఘు చిత్ర దర్శకులకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఉత్సాహం, ఇష్టం, నిరీక్షణ ఉంటే దేనినైనా సాధించవచ్చునని నిరూపించిన చిత్రం సినిమా బండి అన్నారు.

చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ తాను ఎక్కడా శిక్షణ తీసుకోలేదని, గతంలో లఘు చిత్రాలు నిర్మించిన అనుభవం, స్నేహితుల సహకారంతో రూపొందించిన సినిమా బండి చిత్రం గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులను వైజాగ్ ఫిలిం సొసైటీ తరపున ఘనంగా సత్కరించారు.

వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పారిశ్రామికవేత్త భరణికాన రామారావు, సీనియర్ నటులు ఎస్.కె.మిశ్రో, వైజాగ్ జర్నలిస్టుఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, నండూరి రామకృష్ణతోపాటు సొసైటీ సంయుక్త కార్యదర్శి బి చిన్నారావు, కార్యవర్గసభ్యులు ఆర్ శివకుమార్, జి బాబ్జీ, చిత్ర దర్శకుడు ప్రవీణ్ తండ్రి రామచంద్ర ప్రభు, తల్లి అంజు సినీ ప్రియులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



మధురవాడలో విజేతలతో కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని కల్లివానిపాలెంలో కెవిపి గణేష్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా పాలవలస జట్టు నిలిచింది. 50 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ ఫైనల్‌లో లొడగలవానిపాలెం జట్టుపై పాలవలస జట్టు విజయం సాధించింది. విజేత పాలవలసతోపాటు రన్నరప్ లొడగలవానిపాలెం జట్లకు ఆనందపురం మండల ఉపాధ్యక్షులు బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మి ముత్యాలరావు మాజీ సర్పంచ్ బోయి రమణ మాజీ ఎంపిటిసిలు సూరిబాబు, రౌతు వెంకటరావు, లొడగల వెంకటరావు, ఉప సర్పంచ్ బొట్ట శ్రీను, వార్డు సభ్యుడు పైడిరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ పిల్లి రెడ్డి, వెంకటేష్ శివ రాజేష్, గ్రామపెద్దలు రాంబాబు, పాపారావు, రామారావు, కె.అప్పల గురువులు, దుక్కవానిపాలెం పెద్దలు బంక రమేష్, వర్రం వెంకట్, ఉప్పాడ రామిరెడ్డి, వీఆర్‌పి రెడ్డి, బెండ సూరి, కాశీ విశ్వనాథం, కేవీపీ గణేష్ యూత్ పాల్గొన్నారు

మధురవాడ : బొట్టవానిపాలెం శివారులో క్రీడాశిషులు కొర్రాయి గోవింద్, నమ్మి అప్పలరాజు జ్ఞాపకార్థం నిర్వహించిన బొట్టవానిపాలెం ప్రీమియర్ లీగ్-2023



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ధనలక్ష్మి

పోటీలు ముగిసాయి. ఐదు జట్లు పాల్గొన్న టోర్నీలో బివిపి బుల్స్ జట్టు విజేతగా నిలవగా, బివిపి రాయల్ స్ట్రయికర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ఐదవ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నమ్మి నరసింహులు, నమ్మి సూర్య అప్పారావు, నమ్మి శ్రీను, కొర్రాయి మంగరాజు, కొర్రాయి అప్పలస్వామి, కనకదుర్గ సప్లయర్స్ ఈవెంట్స్ కొర్రాయి సురేష్, నమ్మి రమణ పాల్గొన్నారు.

# సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఇస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : సమస్యలను తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించడమే గడపగడపకూ ప్రభుత్వ లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. బుధవారం 48వ వార్డు న్యూ శ్రీనివాసనగర్, పోలీస్ లేఅవుట్ తదితర కొండవాలు ప్రాంతాల్లో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవితో కలిసి పర్యటించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, పారిశుధ్య సమస్యను స్థానికులు విన్నవించగా, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మురికివాడలతో పాటుగా కొండవాలు ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, వైసిపి నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలుకు గౌరవ డాక్టరేట్



సామవేదం బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామానికి చెందిన పురోహితులు, పౌరాణిక రంగస్థల నటుడు సామవేదం బాలసుబ్రహ్మణ్యం (బాలు)కు ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చి యూనివర్సిటీ (యుఎస్ఎ), స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ లిమిటెడ్ ఇండియా గౌరవ డాక్టరేట్ వరించింది. వచ్చేనెల 4న హైదరాబాద్ అబిడ్స్‌లోని సరస్వతి భవన్‌లో తనకు డాక్టరేట్‌ను అందజేయనున్నట్లు సంబంధిత ప్రతినిధులు సమాచారం పంపారని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

స్వగ్రామం మద్దిలోనే దాదాపు అర్ధశతాబ్దానికిపైగా పౌరోహిత్యం చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం, పౌరాణిక రంగస్థల నటుడిగా అనేక ప్రదర్శనలిచ్చి, అనేక అవార్డులు, రివార్డులతోపాటు విశేష సత్కారాలను కూడా అందుకున్నారు. నల్లై ఏళ్ల నటనారంగంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాలో దాదాపు నాలుగు వేల ప్రదర్శన లిచ్చారు. 500కు పైగా పరిషత్ నాటకాల్లో విభిన్న పాత్రలను పోషించి, 20కిపైగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, జాతీయ, రాష్ట్ర, జిల్లా పరిషత్ స్థాయిలో అనేక అవార్డులు, సత్కారాలను అందు కున్నారు. అంతేకాక పాతికేళ్లపాటు వ్యాపారంగంలో అనేక బాధ్యతలు నిర్వర్తించారు.

ఈ నేపథ్యంలో బాలసుబ్రహ్మణ్యం కనబరిచిన బహుముఖ ప్రజ్ఞ, ప్రతిభను గుర్తించిన ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చి యూనివర్సిటీ (యుఎస్ఎ), స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ లిమిటెడ్ ఇండియా డాక్టరేట్‌ను ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. పలువురు బాలును అభినందిస్తున్నారు.

# గీతంలో మొక్కల జియో ట్యాగింగ్ పూర్తి

ప్రజాశక్తి -మధురవాడ : దేశ, విదేశాల నుంచి తెప్పించి, గీతంలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, పూలపొదలకు రెండు నెలలుగా గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో చేపడుతున్న జియో ట్యాగింగ్ బుధవారంతో పూర్తయిందని ఆర్కిటెక్చర్ డీన్ ప్రొఫెసర్ మోహన్ తెలిపారు. ఆయా మొక్కల విశేషాలను వందకుపైగా మొక్కలకు క్యూఆర్ కోడ్‌తో జియోట్యాగ్ చేసామన్నారు. గీతం విద్యార్థులతోపాటు సందర్శకులెవరైనా మొక్కల సమాచారం తెలుసుకోవాలంటే, ఆయా మొక్కలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తమ మొబైల్‌లో స్కాన్ చేస్తే, వాటి శాస్త్రీయ నామంతోపాటు ఆయా మొక్కల భౌగోళిక ప్రాంతం, ఇతర వివరాలను తెలుసుకోవచ్చున్నారు. రానున్న రోజులలో గీతంలోని ఔషధ మొక్కల వివరాలతో ప్రత్యేక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. విజయవంతంగా మొక్కల



జియో ట్యాగింగ్‌ను పరిశీలిస్తున్న గీతం విసి


జియోట్యాగింగ్ పూర్తి చేయడంపై గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అభినందించారు.

# 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం విశాఖ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని న్యాయస్థాన ప్రాంగణాల్లో ఫిబ్రవరి 11న జాతీయ లోకదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు గుత్తల గోపి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ లోకదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, ఇన్సూరెన్స్, జీవీఎంసీ, బ్యాంకు తదితర సంస్థల కేసులను పరిష్కరించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవి బులికృష్ణ తెలిపారు.

లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకోవాలన్న సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి ఇరు పక్షాలు తమ సంసిద్ధతను వ్యక్తం చేస్తూ, ఆయాకోర్టులలో గానీ లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని ముందుగా సంప్రదించి, పరిష్కరించుకోవాలని సూచించారు. 2023లో నిర్వహించనున్న తొలి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులు, న్యాయవాదులు, జిల్లా ప్రజలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

# ఘనంగా రుద్రరాజు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేత రాము

ప్రజాశక్తి -పెందుర్తి : ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలను పెందుర్తి మండలం, చిన్నముషిడివాడ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు విన్నకోట రాము స్వగృహంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి, పార్టీ నేతలకు అందించారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ ఎపిసిసి అధ్యక్షుడుగా రుద్రరాజు నియామకంతో పార్టీ కేడర్‌లో నూతనోత్తేజం వచ్చిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పూర్వవైభవాన్ని సంతరించుకుని, కేంద్రం, రాష్ట్రంలో అధికారం హస్తగతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఒబిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఆర్ నాయుడు, ముక్క రాము, శాంతిభూషణం పాల్గొన్నారు

# అప్పన్న సన్నిధిలో ఎపిఇపిడిసిఎల్ సిఎండి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఎపిఇపిడిసిఎల్ సిఎండి జె.పద్మ జనార్దనరెడ్డి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురం కనకరాజు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామి తీర్థప్రసాదాలు అందించారు.

# జిరాయితీ భూమి కబ్జాపై రైతుల నిరసన


## వైసిపి సర్పంచ్ భర్త ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణ

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని కె.సంతపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 126లో 27, 118 నెంబర్లలో తమ జిరాయితీ భూమిని గ్రామ సర్పంచ్ చల్ల మంగ భర్త చల్ల సింహాద్రి నాయుడు (పోస్టు నాయుడు) ప్రభుత్వ భవనాలు పేరు చెప్పి కబ్జాకు పాల్పడుతున్నాడని భూమి హక్కుదారులు బుధవారం సంబంధిత భూమి వద్ద తమ పట్టాలను చూపిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ భూమి విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుందన్నారు. వంశపారపర్యంగా తమ కుటుంబ సభ్యులకు చెందిన ఈ భూమిని బంజర భూమిగా చిత్రీకరించి కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ భూమిపై తమకు ఎటువంటి హక్కు లేదని, ఆ భూమిని అప్పగించకుంటే కేసులు పెడతామని తమను సర్పంచ్ భర్త బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమకు న్యాయం చేయాలని తహాశీల్దారు కార్యాలయంలోనూ, పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా సర్పంచ్ భర్త తన అధికార బలంతో ప్రభుత్వ అధికారులను ప్రలోభ పెట్టి తమకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నాడని, తన అనుచరులతో అక్రమంగా నిర్మాణాలు కూడా చేపడుతున్నాడని తెలిపారు. మంచి చేస్తారని నమ్మి ఓట్లు వేస్తే మాకు నమ్మకద్రోహం చేస్తున్నాడని వాపోయారు. దీనిపై ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని తమ భూమిని తమకు అప్పగించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బాధిత రైతులు చల్లా శ్రీను, చల్ల చిన్న సన్నిబాబు, చల్ల నాయుడు, చల్ల సింహాద్రి, చల్ల సన్నిబాబు, చల్ల సూర్యనారాయణ, చల్ల రామునాయుడు, కసిరెడ్డి దేముడు, బండారు మల్లేష్, బండారు దేముళ్ళు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

# తులసీరావుకు ఘన నివాళి


తులసీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గేదెల సత్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

యలమంచిలిలో బుధవారం జరిగిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంస్మరణ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుండి పార్టీలకు అతీతంగా వందలాది మంది నాయకులు, రైతులు తరలివెళ్లారు. తులసీరావు రైతాంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తులసీరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశారని, విశాఖ డెయిరీ పేరును భారతదేశ వ్యాప్తం చేశారని కొనియాడారు. రైతులకు అవసరమైన అనేక సదుపాయాలను సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, మండలంలోని పలు గ్రామాల పాల సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, వేతన కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తులసీరావు సేవలు మరువలేనివి

అనకాపల్లి : పాడి రైతులకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు చేసిన సేవలు మరువలేనవని టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు నడిపల్లి గణేశ్వరరావు అన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో తులసీరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు బొడ్డపాటి నూకు నాయుడు, మార్టూరు జగ్గారావు, పాల సంఘం అధ్యక్షులు పెద్ది శెట్టి బద్రీనాథ్, పన్నీరు చంటి, పాడి రైతులు పాల్గొన్నారు.


తులసీరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

# ఎన్ఎఓబి నిర్వాసిత గ్రామాల్లో ఆర్‌డిఒ సర్వే


ఆర్‌డిఒకు తమ సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న నేవీ నిర్వాసితులు


ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఓబి నిర్వాసితులు 80 రోజులుగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుధవారం అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ, రాంబిల్లి తహాశీల్దారు భాగ్యవతి, ఇతర అధికారులు సర్వే నిర్వహించారు. నిర్వాసిత గ్రామాలైన చిన్న కలవలపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాలలో సర్వే చేశారు. నేవీ ప్రాజెక్టు రావడం వలన తమకు జరిగిన అన్యాయంపై నాలుగు గ్రామాల నిర్వాసిత పెద్దలు సమస్యలతో కూడిన వినత పత్రాన్ని అధికారులకు అందించారు. పిఎఎఫ్ గ్రామాలైన కొత్తపట్నం, వాడ నరసాపురం, కేజీ.పాలెం, పిడిఎఫ్ గ్రామాలైన నేవీ కాలనీ గ్రామాల పెద్దలు వారి సమస్యలను వినతిపత్రం రూపంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు ద్వారా జిల్లా అధికారులకు అందించారు. బోట్లకు రూ.6 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, జీవన భృతి కుటుంబ పెద్దతో పాటు మేజర్ కుమారులకు అందించాలని డిమాండ్ చేశారు.

### కొనసాగిన 50వ రోజు ఆందోళన

నేవీ మెయిన్ గేటు ముందు నిర్వాసిత ఎనిమిది గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ఆందోళన బుధవారం నాటికి 80వ రోజుకు చేరింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని నేవీ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. శారద, వరాహ నదుల్లో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించే వాళ్లమని, ఇప్పుడు నేవీ వాళ్లు గేట్లు మూసివేయడంతో తమ చేపల వేట సాగక ఉపాధి లేకుండా పోయిందని తెలిపారు. తక్షణమే జెట్టీ నిర్మాణం చేయాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా వేటకు వెళ్లే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న నిర్వాసితులు


దేహదానానికి అంగీకార పత్రం అందజేస్తున్న అజయ్ కుమార్

## దేహదానానికి అజయ్ కుమార్ అంగీకారం

ప్రజాశక్తి- అనకాపల్లి

జ్యోతి బసు వర్ధంతిని పురస్కరించుకొని అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ మరణానంతరం తన దేహాన్ని దానం చేయడానికి అంగీకారం తెలిపారు. జ్యోతి బసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ఆధ్వర్యంలో మరణానంతరం వైద్య పరిశోధనలకు పార్థివ దేహాలను అందజేస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం అజయ్‌కుమార్ తన అంగీకర పత్రాన్ని జ్యోతి బసు దేహదాన ప్రోత్సాహక సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి వివి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్‌కు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

## రోడ్డు పనులు చేయకుంటే దీక్ష

ప్రజాశక్తి-గొలుగొండ

వారం రోజుల్లో గొలుగొండ మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతం రోడ్డును అభివృద్ధి చేయకుంటే ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, ఆరిలోవ ప్రాంతంలో మూడు కిలో మీటర్ల రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందని, తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి సమయాల్లో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేసే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే గణేష్ ఈ రోడ్డు అభివృద్ధికి కృషి చేయలేదని ఎద్దేవా చేశారు. నాతవరం నుంచి తాండవ వెళ్లే రోడ్డు దారుణంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబల్ల శివ, లింగంపేట ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ, పాతకేడిపేట ఉప సర్పంచ్ దుంగలపూడి సహదేవుడు, సలాదుల ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, ఠాగూర్, వీసం వెంకటేష్, నాతవరం మండలం నాయకులు వేగిశెట్టి శ్రీను, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

## పాత్రికేయుని కుటుంబానికి ఎంవిఆర్ పరామర్శ

ప్రజాశక్తి-కశింకోట

సీనియర్ పాత్రికేయులు ఆళ్ల వెంకట అప్పారావు మాతృమూర్తి ఆళ్ల లక్ష్మి శుక్రవారం మృతి చెందగా, ఆయన్ను, ఆయన కుటుంబాన్ని బుధవారం అనకాపల్లికి చెందిన ప్రముఖ వాణిజ్యవేత్త ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు పరామర్శించారు. వెంకట అప్పారావు స్వగృహానికి వెళ్లి వారిని పరామర్శించి సంతాపం, సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్ద చనిపోవడం ఎవరికైనా బాధాకరమైన విషయమని, ఆ లోటు ఎవరూ తీర్చలేదని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.


వెంకట అప్పారావును పరామర్శిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు

## ఖాతాదారులకు మెరుగైన సేవలు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** తమ ఖాతాదారులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మెరుగైన సేవలు అందిస్తుందని తుమ్మపాల బ్రాంచ్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు అన్నారు. బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం ఖాతాదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర జాతీయ బ్యాంకుల కన్నా తమ బ్యాంకు డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు 444 రోజులకు 7.6 శాతం, 777 రోజులకు 8 శాతం, మిగిలిన డిపాజిట్‌దారులకు 444 రోజులకు 7.1 శాతం, 777 రోజులకు 7.6 శాతం చెల్లిస్తుందని చెప్పారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.3,950 రుణాన్ని బ్యాంకు పని దినాల్లో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జాతీయ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి, జీవన సురక్ష పథకాల ద్వారా బీమా సదుపాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, క్యాషియర్ కుంచంగి శంకర్రావు పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీకే చెరుకు సరఫరా చేసేలా చర్యలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అనకాపల్లి జిల్లా చోడవరం గోవాడ సహకార చక్కర కర్మాగారం ప్రాంతంలోని చెరకు రైతులు తమ చెరుకును ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి నష్టపోకుండా, ఫ్యాక్టరీకే సరఫరా చేసేలా ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ఉప చెరకు కమిషనర్ కె.లోకేశ్వర్ ఆదేశించారు. అలాగే రైతులు చెరుకు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు.

## 21న వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఉత్తరాంధ్రలోనే పేరెన్నిక గన్న అనకాపల్లి వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈనెల 21న భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. స్థానిక వేల్పుల వీధి సీతారామ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు బొద్దపు ప్రసాద్, కార్యదర్శి యడ్ల గోవింద రావు, ఉపాధ్యక్షులు దోమరౌతు రవి శంకర్, రౌతు సతీష్, సహాయ కార్యదర్శులు కరణం గౌరీస్, మద్దాల చిరంజీవి రమణ, కోశాధికారి బాసూరి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కరోనా నేపథ్యంలో గత రెండేళ్లుగా ఉత్సవాలు నిర్వహించలేదని, ఈ ఏడాది భారీ ఎత్తున 14 స్టేజి ప్రోగ్రామ్స్, నేల వేషాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాఖ జాలరిపేట వారిచే దాండియా డ్యాన్సులు, విజయనగరం వారి భయంకర పులి వేషాలు, వేపగుంట వారి మహిళా తీన్మార్, తాడేపల్లిగూడెం వారిచే కేరళ డప్పుల డ్యాన్స్, కోయవేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్ళు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాణసంచాకు రారాజుగా పేరుగాంచిన కీర్తిశేషులు మందు గుండు సీతారామయ్య వారి భార్య అమ్మాజీ, రామప్పారావు జ్ఞాపకార్థం ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో భారీ బాణసంచా హంగామా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, మాజీ మంత్రులు గంట శ్రీనివాసరావు, ముత్తం శెట్టి శ్రీనివాసరావు, దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు మద్దాల కూర్మారావు, జనపరెడ్డి శ్రీరాములు, ముత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలింతలకు పండ్లు పంపిణీ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు రుద్రరాజు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, అనకాపల్లి మండల అధ్యక్షులు కాళ్ల వెంకట సత్యనారాయణ, ఆడారి రామారావు, బి బాల మురళి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు

### ఎస్‌పి గౌతమి శాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి**

స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 22న జరగనున్న పోలీస్ కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. జిల్లాలోని అనకాపల్లిలో 11, చోడవరంలో 5, మునగపాకలో 2, అచ్యుతాపురంలో 2, మాకవరపాలెంలో 1, మొత్తం 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 9,897 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని, వీరిలో 2,781 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 10 గంటల తర్వాత ఒక నిమిషం దాటిన పరీక్షకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. అభ్యర్థుల విలువైన సామాన్లు వారే జాగ్రత్త చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లలో సూచించిన నియమ నిబంధనలు పాటించాలని, మొబైల్, డిజిటల్ వాచ్లు, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. సెక్షన్ 144 అమల్లో ఉన్నందున పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని, ప్రజలు గుమ్మిగూడడం నిషేధమని పేర్కొన్నారు. పరీక్ష రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం అనకాపల్లి, చోడవరంలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు నోడల్ ఆఫీసర్‌గా అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్‌తో పాటు వివిధ పరీక్ష కేంద్రాల వద్ద నలుగురు డిఎస్పీలు, ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్లు నియమించినట్లు తెలిపారు. రాత పరీక్షల నిమిత్తం అనకాపల్లి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్‌గా డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్ల నరసింహం తోపాటు 21 పరీక్ష కేంద్రాల్లో 21 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 25 మంది అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్‌పి గౌతమి శాలి

# రహదారి భద్రతపై అవగాహన అవసరం

### కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి




బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, అధికారులు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

రహదారి భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో రహదారి భద్రత వారోత్సవాల బ్యానర్‌ను జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.వీర్రాజు, అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ హేమంత్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారోత్సవాలు భాగంగా ఆటో రిక్షాలు, లారీ, స్కూల్, కళాశాల బస్సు డ్రైవర్లు, విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేప్పాలని సూచించారు. పోలీసు, రవాణా, ఇంజనీరింగ్, వైద్య శాఖల సమన్వయంతో ప్రమాదాలను నియంత్రించేందుకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ రామారావు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, రాజన్న, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 23 నుంచి 27 వరకు దీక్షలు, ధర్నాలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేపడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23 నుంచి 27 వరకు దీక్షలు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ, ఎఐటియుసి నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకులు కోన లక్ష్మణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, అనకాపల్లి జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో ఆర్డిఓ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు, 25న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా, 27న విశాఖపట్నంలో లక్ష మందితో కార్మిక మహాగర్జన నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వీటిల్లో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేవుడుబాబు, ఎంసూరిబాబు, వెంకటేశ్వర్లు, బి పద్మ పాల్గొన్నారు.

## నేడు మండల సమావేశం

**ప్రజాశక్తి-రావికమతం :** మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశంనకు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంనకు ఎవరు రాకున్నా వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సభ్యులు గ్రామ సమస్యలపై అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారం ఉండాలని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలన్నారు.

# అర్హులకు పథకాలు అందకుంటే తెలియజేయండి

### రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్




పోలియో బాధితుడిని పరామర్శించి వారి సమస్య వింటున్న మంత్రి అమర్‌నాథ్

**ప్రజాశక్తి-అనకాపల్లి**

కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందని, అర్హులై ఉండి ఎరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు కాళ్లు చచ్చుబడిన కొండ లక్ష్మి అనే వికలాంగురాలు తనకు సొంత ఇల్లు మంజూరు చేయాలని మంత్రిని అభ్యర్థించారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన అధికారులను పిలిచి ఇంటి స్థలం మంజూరుతో పాటు ఇంటి నిర్మాణం చేయాలని ఆదేశించారు. పోలియోతో బాధపడుతున్న పిల్లల వెంకట అప్పారావు తనకు ఇచ్చే వికలాంగుల పింఛన్ సరిపోలేదని, అదనపు ఆర్థిక సహాయం అందించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, సర్పంచులు శలపురెడ్డి నరసింహారావు, సాలాపు కనక సన్యాసిరావు, ఈగల రామునాయుడు, కలగా గున్నయ్య నాయుడు, సేనాపతి శ్రీను, జోగ నాగేశ్వరరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ నారపిన్ని ప్రసాద్, మామిడి ధనలక్ష్మి, సీరంశెట్టి అప్పలరాజు, మాజీ సర్పంచ్ రఘు పాల్గొన్నారు.

**రూ.2.50 కోట్లతో మినీ స్టేడియం**

**చోడవరం :** చోడవరం ఎడ్ల వీధిలో రెండు కోట్ల 50 లక్షల రూపాయలతో మినీ స్టేడియం నిర్మించనున్నామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం చోడవరం సచివాలయం-3 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. స్థానిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్ల వీధిలో ఉన్న ఎర్ర చెరువును ఇరిగేషన్ అధికారుల అనుమతులతో పూడ్చివేసి ఆ ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని చెప్పారు. చెరువుగట్టుపై పాకలు వేసుకుని ఉన్నవారందరికీ పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యారావు, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఎంపీపీ గాడి కాసు, వైసిపి నాయకులు ఓరుగంటి నెహ్రూ, దేవరపల్లి సత్య, పొట్లూరి అరుణ, బైన ఈశ్వరరావు, సూర్యనారాయణ, పి అప్పారావు యాదవ్, వేచలపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

# గడప గడపకూ సంక్షేమం

## ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

**ప్రజాశక్తి-మాకవరపాలెం:**గడప గడపకు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. రాచపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పథకాలు రానివారు ఎవరైనా ఉంటే స్థానిక సచివాలయంలో దరఖాస్తులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు వాసు, జడ్పిటిసి సత్యవేణి, భద్రాచలం, పలువురు వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్


సామగ్రి ఇస్తున్న క్లబ్ ప్రతినిధి

# విజేతలకు బహుమతుల ప్రదానం

**ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:**మకర సంక్రాంతి సంబరాలలో భాగంగా సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి తీర్థం సందర్భంగా వెలమ వీధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసి పాత్రుడు, డిసిసిబి చైర్ పర్సన్ చింతకాయల అనితలు విజేతలకు బహుమతులు అందజేశారు. చింతకాయల సన్యాసి పాత్రుడు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ సారి 51 మంది మహిళలు పాల్గొన్నారన్నారు.ప్రతి ఒక్కరికి చీరలు అందించామని తెలిపారు. తీర్థం సందర్భంగా రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


బహుమతులు ఇస్తున్న అనిత, సన్యాసిపాత్రుడు

## వికలాంగులకు సరుకుల పంపిణీ

**ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:**:వాసవి క్లబ్ ఆధ్వర్యం లో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వికలాంగులకు కిరాణా సరుకుల కిట్లు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ప్రతినిధి మామిడి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పెనుగొండ రమేష్, ఆలయ అధ్యక్షులు దేవత కామేష్, వాసవి క్లబ్ సభ్యులు వూడా సూర్యారావు, సురేష్, దంగేటి లక్ష్మణావు, మామిడి రామకృష్ణ, రాంజి పాల్గొన్నారు.

# వాడవాడలా ఎన్‌టిఆర్ వర్ధంతి


అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న నేతలు

**సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 27వ వర్థంతి కార్యక్రమాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.**

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్టీ రామారావు 27వ వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం వద్ద మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. బెల్లం మార్కెట్, విజయరామరాజుపేట, గవరపాలెం పరమేశ్వరి పార్క్, ఎన్టీఆర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లోనూ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. తెలుగు యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ నారాయణరావు, మల్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, ఎం.నీలబాబు, బిఎస్ఎన్‌కె.జోగినాయుడు, బొద్దపు ప్రసాద్, పోలవరపు త్రినాధ రావు పాల్గొన్నారు.

**కశింకోట :** కశింకోటలోని ఎన్‌టిఆర్, బసవ తారకం విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పూలమాల వేశారు. పార్టీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, ఎంపిటిసి షేక్ దర్గా, జగన్నాథం, షేక్ బాబర్ పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట :** మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు పూలమాలలు వేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు చేతుల మీదుగా పేదలకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మర్షా సతీష్, గన్నాబత్తుల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నాగులపల్లి సత్యనారాయణ, ఉపసర్పంచ్ చిన్ని పైడిరాజు పాల్గొన్నారు.

**వడ్డాది :** బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి బత్తుల తాతయ్యబాబు శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ నాయకులు తమరాన దాసు, గోకివాడ కోటేశ్వరరావు, దొండా శ్రీను, సాయం శేషు, దొండా నరేష్, సిరిగిరి శెట్టి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

**అచ్యుతాపురం:**మండలంలోని పూడిమడక, తిమ్మరాజుపేట, జగ్గన్నపేట, మోసయ్యపేట, ఎం.జగన్నాధపురం గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. పూడుమడకలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పూడిమడక, మోసయ్యపేటలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు రాజాన రమేష్ కుమార్, లాలం భాస్కరరావు, మెరుగు బాబు నాయుడు,
పుర్రె శ్రీనివాసరావు, జనపరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు రంగలి మహేష్ ఆధ్వర్యంలో పార్టీ నియోజవర్గ పరిశీలకులు లోగడ కృష్ణ, ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సబ్బవరం :** స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకపల్లి, ఇరువాడ గణపతినగర్‌లో మిడతాడ మహాలక్ష్మి నాయుడు, రేసుపూడి రమణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు బండారు అప్పల నాయుడు, పీలా శ్రీనివాసరావు, గండి రవి కుమార్, గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, కోటాన అప్పారావు, సర్పంచ్ దెడ్డము ప్రసాదరావు, ఎంపిటీసీ గొర్లి చైతన్య పాల్గొన్నారు.

**చోడవరం :** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చోడవరం టిడిపి కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డేటి నాగ గంగాధర్, యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, నాయకులు బత్తుల తాతయ్య బాబు, బుద్ధ నాగ జగదీశ్వరరావు, లక్ష్మీనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట :** చోడవరంలో టిడిపి కార్యాలయంలో జరిగిన రక్తదాన శిబిరంలో మండలంలోని దిబిడి గ్రామానికి చెందిన సేనాపతి మణికంఠ, పెదిరెడ్ల మాణిక్యం, వియ్యపు రాము, జర్థ చిరంజీవి, మంత్రి మహేష్, బంటు సాయి, డి గణేష్ రక్తదానం చేశారు.

**నర్సీపట్నం రూరల్:**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతిని పట్టణంలో టీడీపీ శ్రేణుల బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ పైల గోవిందరావు, రావాడ నాయుడు, జాలమూరి బంగారాజు, టీడీపీ నాయకులు రాజేష్, కొరుప్రోలు శ్రీసు, జంపన నాగేంద్రరాజు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

**కొత్తకోట:**టి.అర్జాపురం, మేడివాడ, రావికమతం, కొత్తకోట, గంపవాని పాలెం గ్రామాలలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు.జెడ్ కొత్తపట్నంలో టిడిపి నాయకులు గాలి రమణ, తాతాజీ, నాయుడు, తారకం ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ఎన్ఎస్ రాజు, చోడవరం టిడిపి ఇన్‌ఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, చక్కర కర్మాగారం మాజీ చైర్మన్ గునూరు మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, టి. అర్జాపురం సర్పంచ్ ఎం.అర్జున, కొత్తకోట మాజీ సర్పంచ్ కోట నీలవేణి, గోవిందరావు, కోట సత్తిబాబు పాల్గొన్నారు.

**కోటవురట్ల:** మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, జల్లూరులో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కాశి నాయుడు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల ఎంపీటీసీ సభ్యులు పి.సూర్యారావు, టిడిపి సీనియర్ నాయకులు వేచలపు భాస్కరరావు, జానకి హరిబాబు, పాల్గొన్నారు.

**మాకవరపాలెం**:మండలలోని తామరం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రుత్తుల యర్రా పాత్రుడు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు కోసూరు శ్రీను, సర్పంచ్ అల్లు రామ నాయుడు, మాజీ జెడ్పీటీసీ కుమార్, సర్పంచ్ దుంగల వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ నందకిషోర్ పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్:**ధర్మసాగరంలో జడ్పిటిసి సుకల రమణమ్మ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**నక్కపల్లి:**నక్కపల్లిలో తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కోటవురట్లలో..

మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ , నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, దేవర సత్యనారాయణ, మీగడ సత్తిబాబు, వెలగా శ్రీను, కర్రి వెంకట సత్యనారాయణ, లోవరాజు, వైబోయిన రమణ, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, కొంకిపూడి దొరబాబు, తోలేటి శ్రీనివాస్, కుంచె మధు, మేరిగి నాగేశ్వరరావు, ప్రగడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు

**రోలుగుంట:**. రోలుగుంటలో మండల టీడీపీ ఇన్‌చార్జ్ బంటు రాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పించారు. బుచ్చింపేట గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మాజీ సర్పంచ్ పోతురాజునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రొంగలపాలెం, జెపి.అగ్రహారం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.

**గొలుగొండ:** మండలంలోని ఏఎల్ పురం గొల్లవీధిలో మాజీ జెడ్పీటీసీ చికెటిల తారకవేణుగోపాల్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పేదవారికి దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు జమీల్, మాజీ ఎంపీటీసీ చింతల నారాయణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

సిహెచ్. నాగాపురంలో తెలుగుదేశం సీనియర్ నాయకుడు పోలిశెట్టి జగ్గయ్యదొర, మాజీ సర్పంచ్ కొలగని రామారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ మెంబర్ బొప్పన ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు సుర్ల బాబ్జి పారేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


బుచ్చయ్యపేటలో ..


నర్సీపట్నంలో...

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

## అనకాపల్లి క్లస్టర్ ఎపిడి మణికుమార్

**ప్రజాశక్తి-రావికమతం** :ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని అనకాపల్లి క్లస్టర్ ఎపిడి మణికుమార్ కోరారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ పనులు త్వరిత గతిన ప్రారంభం కావాలన్నారు. పండుగలు, వ్యవసాయ పనులు పూర్తవడంతో ప్రజలందరూ ఖాళీగా ఉన్నందున వారందరికీ ఉపాధి కల్పించవలసిన బాధ్యత ఉందని ఆయన తెలిపారు. మట్టి రోడ్లు, పంట కాలవలు, శ్మశానాల అభివృద్ధి, కాలువల పూడికతీత, పండ్ల తోటల పెంపకం 450 పనులుకు గాను మండలానికి రూ.17 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి, రైతాంగానికి, సమాజానికి ఉపయోగపడే పనులు గుర్తించి వాటిని చేపట్టాలని సూచించారు.జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనికి కల్పించాలని, అవసరమైతే ప్రతి ఇంటికి వెళ్లి పనికి రావాలని కోరాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేతన కూలి రూ.257 తక్కువ కాకుండా పని కల్పించాలని ఆయన తెలిపారు. రూ. 257లు ఒక మనిషికి రావాలంటే ఎంత పని చేయించాలన్నది సిబ్బందికి వివరించారు. తాను ప్రతి గ్రామంలో పర్యటిస్తానని, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా అందరూ కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. ప్రజల ఏ ఒక్కరూ గ్రామం నుంచి వలస వెళ్లే పరిస్థితి రాకుండా పని కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించినా వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం మరుపాక పంచాయతీ మరుపాక, దాసరయ్యపాలెం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలతో సమావేశ మయ్యారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ కాశి, ఈసీ కామేష్, టీఏలు మోహన్, రమణ పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిడి మణికుమార్




మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

## దళితులపై దాడి తగదు

**ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:** మాకవరపాలెం మండలం జి.నగరంలో ఈనెల 16న జరిగిన సంఘటనలో దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ.చిరంజీవి, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు లోవరాజు మాట్లాడుతూ, దళితులు, బీసీల మధ్య గొడవ జరిగినప్పుడు దళితులను మాత్రమే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్టు చేసిన దళితులను వెంటనే విడుదల చేయాలన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే అరెస్టు చేసి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

## సమయపాలన పాటించాలి

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండల సమావేశం మందిరంలో బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయం సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఇంజనీరు వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ కరుణ, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరు జగదీశ్వరరావు, ఇఓపిఆర్‌డి ప్రేమ్ కుమార్, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న ఎంపిపి

## వైఎస్ఆర్ బీమా నగదు అందజేత

**ప్రజాశక్తి-చీడికాడ:**మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు వైయస్సార్ తక్షణ బీమా సహాయం కింద పది వేలను అందజేశారు. ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, ఎంపీడీవో జయప్రకాష్, దండి సురవరం పిఎసిఎస్ అధ్యక్షులు నందారపు రమణబాబు నగదును మృతుడు భార్యకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు

## 21న విద్యార్థులకు పోటీలు

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండల కేంద్రంలో జూనియర్ కళాశాల వద్ద వాకర్స్ క్లబ్ సహకారంతో ఈనెల 21న ఉదయం 9గంటల నుండి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కొండబాబు తెలిపారు. ఈ పోటీలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వారు పాల్గొవాలన్నారు. ప్రథమ బహుమతి రూ.2000, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి 1000 చొప్పున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఆదివాసీలకు సౌకర్యాలు కల్పిస్తాం

## ఆందోళనకు అధికారుల స్పందన

**ప్రజాశక్తి-కొత్తకోట:**కనీస వసతులు కల్పించాలని కోరుతూ ఆదివాసీల చేపట్టిన ఆందోళనకు జిల్లా కలెక్టర్ స్పందించారు. బుధవారం ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందించి రావికమతం మండలం చీమలపాడు శివారు జీలుగులోవ గ్రామ ఆదివాసీ గిరిజనులతో కల్యాణపులోవ శివాలయం వద్ద తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపిడిఓ వెంకన్నబాబు తదితరుల అధికారుల బృందం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీలతో అధికారుల బృందం మాట్లాడుతూ, గ్రామాన్ని కల్యాణపులోవ సమీపంలో సర్వే నెంబర్ 149కి గ్రామాన్ని తరలిస్తామని కుటుంబానికి రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలం కేటాయించి లే అవుట్ వేసి అక్కడే అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి రేషన్, ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం, విద్యార్థులకు జనన ధ్రువ పత్రాలు అందజేస్తా మని వారికీ వివరించారు. దీనికి సమ్మతించిన ఆదివా సీలు గ్రామం తరలించే వరకు ప్రస్తుతం ఉన్న చోట వ్యవసాయం చేసుకునేందుకు వసతులు కల్పించాలని, కనీస రోడ్డు మార్గం, తాగునీరు, సోలార్ విద్యుత్, గ్రావిటి స్కీమ్ కల్పించాలని అధికారులను కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ కు నివేదిక అందజేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ వైద్య శాఖ అసిస్టెంట్ డిఎంహెచ్‌వో జ్యోతి, కొత్తకోట పిహెచ్సి వైద్యాధికారి రజిని, సర్పంచ్ వంజరి గంగరాజు, అంగన్వాడీ సూపర్ వైజర్ విజయ, విఆర్‌వో నాయుడు పలువురు మండల స్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులు అందజేస్తున్న అధికారులు

## ఆర్‌డిఒగా జయరామ్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**నూతన రెవెన్యూ డివిజన్ అధికారిగా హెచ్.జయరాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నర్సీపట్నం ఆర్‌డిఒగా పని చేసిన భవాని శంకర్ స్థానంలో జయరామ్ బాధ్యతలు చేపట్టారు. నూతన ఆర్‌డిఒకు తహసిల్దార్ వివి. రమణ, కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయరాం మాట్లాడుతూ, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, భూముల డ్రోన్ సర్వే పనులు వేగవంతంగా అయ్యేలా కృషి చేస్తానన్నారు.స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కారం చేస్తానని తెలిపారు.

## బంగారం చోరీపై దర్యాప్తు

**ప్రజాశక్తి-పాయకరావుపేట:**పట్టణంలోని బృందావన కాలనీలో అనసూరి నూకరాజు ఇంట్లో బంగారం చోరీపై అన్ని కోణాల్లో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని సిఐ అప్పలరాజు తెలిపారు. క్లూస్ టీం బృందంతో వేలిముద్రలు సేకరించారు.



విచారణ చేపడుతున్న సిఐ

## పాడేరు కాంప్లెక్స్ కిటకిట

**ప్రజాశక్తి-పాడేరు టౌన్**: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఆర్‌టిసి కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ పూర్తి కావడంతో విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా అవసరాల నిమిత్తం సొంతూళ్లకు, అత్తమామలు, తల్లిదండ్రుల ఇళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. వచ్చిన ప్రయాణికులతో అర్‌టిసి బస్ కాంప్లెక్స్ కిక్కిరిసి పోయింది.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న గిరిబాబు

## క్రీడలతో మానసికోల్లాసం

**- జెడ్‌పిటిసి గిరిబాబు**

**ప్రజాశక్తి-గొలుగొండ:**క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. పాకలపాడు గ్రామంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం పారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పండుగల నేపథ్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా ఇటువంటి క్రీడలు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల సీనియర్ నాయకులు కోరుప్రోలు ఫణి, మండల నాయకులు సింగంపల్లి నాయుడు, సర్పంచ్ రాజనా అప్పనాయుడు, ఎంపిటిసి యాళ్ల నాయుడు పలువురు యువకులు పాల్గొన్నారు.

## కనోస పాఠశాలలో పూర్వ విద్యార్థుల సందడి

**ప్రజాశక్తి-పాయకరావుపేట:**పట్టణంలోని కనోస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2014 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలలో కలుసుకున్నారు. పలు సాంస్కృత కార్యక్రమాలు, డ్యాన్సులతో ఉపాధ్యాయులతో ఆనందంగా గడిపారు. కష్టాల్లో ఉన్న పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పిటి శ్రీను, అలెక్స మేరీ, ప్రిన్సిపల్ సోఫియా తదితరులు పాల్గొన్నారు.



కలిసిన పూర్వ విద్యార్థులు